క్లుప్తంగా

విలీన గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ 14వ డివిజన్‌లో ఇటీవల విలీనం చేసిన ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్ గ్రామంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆధ్వర్యంలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా నూతనంగా విలీనమైన గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా ఆయిల్ బాల్స్ వేశారు. వార్డ్ ఆఫీసర్ సాయి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షులు బుర్ల శ్రీనివాస్, ఆడెపు రాజేశ్, కస్నూరి శంకర్, బొట్ల పోషం, స్వామి, లింగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



కోచ్ కృష్ణమూర్తిగౌడ్‌తో విద్యార్థిని

పాలకుర్తి: బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాల విద్యార్థిని ప్రియాంకకుమారి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కృష్ణమూర్తిగౌడ్ తెలిపారు. ఈనెల 5న గోదావరిఖనిలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ప్రియాంకకుమారి ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ంది. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

మంథనిరూరల్: గ్రామాల్లో మంచినీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని డీఎల్‌పీవో కొమ్మెర సతీశ్‌కుమార్ ఆదేశించారు. మంథని మండలం ఎగ్లాస్‌పూర్ గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన పంచాయతీ రికార్డులను, వాటర్ ట్యాంక్, వైకుంఠధామం, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ ప్రేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచండి

కోల్‌సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో పెరిగిన 60 డివిజన్లకు సరిపడా పారిశుధ్య రిక్షా(ర్యాగ్‌పిక్కర్స్) కార్మికుల సంఖ్యను పెంచాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీకి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం పెరిగిన డివిజన్లకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. మహిళా కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్మశాన వాటిక వద్ద కనీస సౌకర్యాలు కరువు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేయడానికి వెళ్లిన వారికి కనీస సౌకర్యాలు లేవు. మండల కేంద్రంలోని కేశవనగర్‌కు చెందిన పలువురు మంగళవారం ఎంపీడీవో లలితకు ఫిర్యాదు చేశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశవనగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు మృతి చెందగా అంత్యక్రియలు చేయడానికి శ్మశాన వాటి వద్దకు వెళ్లి దహన సంస్కారాలు చేశారు. అనంతరం స్నానాలు చేయడానికి నీటి సౌకర్యం లేదని కార్యదర్శికి ఫోన్ చేసి తెలిపినా పట్టించుకోకపోవడంతో ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవోకు విషయం తెలపగా సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

విద్యార్థినికి అభినందన

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రగతి పాఠశాలలో పదో తరగతి చదివిన కీర్తన బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పాఠశాల కరస్పాండెంట్ కేశవరెడ్డి అభినందించారు.

నిర్లక్ష్యమా.. పర్యవేక్షణ లోపమా?

- మంథని మండలం నర్సరీల్లోని మొక్కల్లో కనిపించని ఎదుగుదల
- వనమహోత్సవానికి సన్నద్ధమవుతున్న అధికారులు
- లక్ష్యం నెరవేరేనా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్న వైనం



నాగారం నర్సరీలో ఎదగని మొక్కలు

మంథనిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా చేపట్టే వనమహోత్సవ లక్ష్యం ఈసారి నెరవేరేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం పేరుతో పచ్చదనం పెంచేలా మొక్కలు నాటారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వనమహోత్సవం పేరుతో గత ఏడాది ప్రతీ గ్రామం, పట్టణాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ జూలైలోనే వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మంథని మండలంలో ఏర్పాటు చేసిన అనేక నర్సరీల్లో మొక్కల ఎదుగుదల లేకపోవడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

34 గ్రామపంచాయతీల్లో..

మంథని మండలంలోని 34 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 10వేల చొప్పున వివిధ రకాల మొక్కలు నాటారు. వేసవికాలం ప్రారంభంలో నర్సరీల్లో మొక్కలు పెంచి వర్షాకాలంలో సంవృద్ధిగా వర్షాలు పడిన తర్వాత వనమహోత్సవలో మొక్కలు నాటుతారు.

నర్సరీల్లో ఎదగని మొక్కలు..

ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో అనుకున్న స్థాయిలో మొక్కల్లో ఎదుగుదల లేదు. కొన్ని నర్సరీల్లో మొలకల స్థాయిలోనే ఉన్నాయి. సాధారణంగా మూడు, నాలుగు నెలల వ్యవధిలో మూడు ఫీట్ల మేర ఎదుగుతుంది. కానీ ఈసారి మొక్కల ఎదుగుదల మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

మంథని మండలంలో ఈ ఏడాది వనమహోత్సవంలో భాగంగా కమ్యూనిటీ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్లలో లక్షా పది వేల మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. 34 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 3.40లక్షల మొక్కల పెంపకం చేపట్టారు. లక్షా పదివేలు మినహా మిగిలిన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయడం, రోడ్లకిరువైపులా నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మొక్కలు సరిగా ఎదగకపోవడంతో లక్ష్యం నెరవేరేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎదిగిన మొక్కలు నాటుతాం

నర్సరీలో ఫీటు, ఆపై పెరిగిన మొక్కలను వనమహోత్సవంలో నాటుతాం. కమ్యూనిటీ ప్లాంటేషన్‌కు అర్ధ ఫీటు పైబడినవి, అవెన్యూ ప్లాంటేషన్‌కు ఫీటున్నర మొక్కలు నాటుతాం. ఈ నెల నుంచి సెప్టెంబర్ వరకు ఈ ప్రక్రియ సాగుతుంది. ఈ క్రమంలో నర్సరీల్లో మొక్కలు ఎదుగుతాయి.

– సదానందం, ఏపీవో, మంథని



గోదావరిఖని: కార్పొరేషన్ 3వ డివిజన్ జనగామలో మూసివేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించాలి. రెండేళ్ల కిందట రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వోవాటర్ ప్లాంట్ ప్రారంభించినప్పటి నుంచి నిర్వహణ సరిగా లేదు. దీంతో ప్లాంట్ గదికి తాళం వేశారు. గ్రామస్తులు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ప్లాంట్ మరమ్మతు పూర్తి చేసి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి.

– తొడుపునూరి రమేశ్‌కుమార్, 3వ డివిజన్, జనగామ

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

పేదల ఆశాజ్యోతి వైఎస్సార్



మంథని: నివాళి అర్పిస్తున్న నాయకులు



యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న నాయకులు



రామగిరి: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఓదెల: కొలనూర్‌లో..



ముత్తారం: కేశనపల్లిలో..

యైటింక్లయిన్‌కాలనీ: పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల ఆశాజ్యోతి అని కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్‌తో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. జక్కుల దామోదర్ రావు, మార్కరాజు, చక్రపాణి, కేశవులు, రాములు, సదానందం, సారయ్య నాయక్, మహేశ్, రాజేశం పాల్గొన్నారు.

మంథని: మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, పోలు శివ, ఎరుకల ప్రవీణ్, సాదుల శ్రీకాంత్, మంథని సత్యం, ఆజీంఖాన్, కుడుదుల వెంకన్న, సీపతి బానయ్య, ఆకుల కిరణ్, అరెల్లి కిరణ్, ఊదరి శంకర్, బెజ్జంకి డిగంబర్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని సెంటినరికాలనీలోని శ్రీపాదభవన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, నాయకులు ఆరెల్లి కొమురయ్య, కొరుకొప్పుల తులసీరాం, మైదం వరప్రసాద్, ఎల్లె రామ్మూర్తి, కాటం సత్యం, ముస్త్యాల శ్రీనివాస్, తీగల సమ్మయ్య, బాబురావు, బండారి సదానందం, అవినాష్, శివ, మల్లేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని కేశనపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు రాజయ్య, తూటి రఫీ, శివకుమార్, వినీత్, రామన్న, శ్రీనివాస్, విజయ్, చంద్రమౌళి, సదానందం పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కనగర్తి, పొత్కపల్లి, కొలనూర్, గుంపుల గ్రామాల్లో వైఎస్సార్ ఫొటోకు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు శంకర్, రంగు రత్నయ్య, నరేశ్, మధునయ్య పాల్గొన్నారు.

వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు అవసరం



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ: వర్షాకాలంలో అంటువ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ప్రజలకు సూచించారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థలోని పలు డివిజన్లలో అవగాహన కల్పించారు. గోదావరిఖని శివాజీనగర్ కూరగాయల మార్కెట్‌లోని మరుగుదొడ్ల నిర్వహణను డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. గాంధీ చౌరస్తా నుంచి రామాలయం రోడ్డులో వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. రీగల్ షూమార్ట్ రోడ్డులో వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం ప్రయోజనాలు వివరించారు. గంగానగర్‌లోని రంగనాథస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న వాల్ ఆర్ట్‌ను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగ భూషణం, కిరణ్, కుమారస్వామి, హెల్త్ అసిస్టెంట్ సంపత్, వార్డు అధికారులు సాయి, గంగయ్య, శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్వేత, సమంత, ప్రియదర్శిని పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



సంబరాల్లో మహిళలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పట్టణ గౌడ మహిళా శక్తి ఆధ్వర్యంలో ఆషాఢమాసం గోరింటాకు సంబరాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గోరింటాకు చెట్టును, అమ్మవారి విగ్రహం పక్కన అలంకరించుకొని పూజలు చేసి గోరింటాకు పెట్టుకున్నారు. మాచిడి శారద, తిరుమల అనురాధ, బందారపు సంధ్యారాణి, బందారపు సుజాత, బొడిగె స్వప్న ప్రియా, మాచిడి వినూషా, చట్ల రమాదేవి, తాడూరి శోభ, పొన్నం సుమలత, నాగుల సావిత్రి, మూల జయ, బుర్ర వనజ, రంగు శ్యామల, డాక్టర్ అనుశ్రీ పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనవద్దు

గోదావరిఖని: సమ్మెలో పాల్గొనకుండా కార్మికులు విధులకు హాజరుకావాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతను దృష్టిలో ఉంచుకుని విధులకు హాజరై సహకరించాలన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట, రాములపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏడాదిగా చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసి తయారు చేసిన నివేదికను గ్రామసభ ముందు ఉంచారు. జేఈ రాజ్‌కుమార్, ఏపీవో సదానందం, టీఏ రంజిత్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధిహామీ కూలీలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై స్వామి పాల్గొని విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి వివరించారు. ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ సురేశ్ పాల్గొన్నారు.

• మండల ప్రధాన కార్యదర్శిగా నియామకం

పాలకుర్తి: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా బీసీ కాలనీకి చెందిన కంకటి శ్రీనివాస్ నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

• జాతీయ సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

జ్యోతినగర్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సీపీఎం రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

• సమ్మె విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: దేశవ్యాప్తంగా 9న నిర్వహించే సమ్మెను విజయవతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు నరేశ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యైటింక్లయిన్‌కాలనీలో మంగళవారం వివిధ సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సమ్మెలో అన్నివర్గాల కార్మికులు, ప్రజలు పాల్గొని సమ్మె జయప్రదం చేయాలని కోరారు. బి.అశోక్, గట్టయ్య, రాయమల్లు, పోచం, లక్ష్మి, లింగయ్య పాల్గొన్నారు.

• ఘనంగా ఉర్సు ఉత్సవాలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలో సయ్యద్ హజ్రత్ అబ్దుల్ ఖాదర్ షాహిది రహ్మతుల్లా ఆలైదర్గాలో ఉర్సు ఉత్సవాలు నిర్వాహక కమిటీ సభ్యులు ఘనంగా చేపట్టారు.

• దేశవ్యాప్త సమ్మెకు టీపీఎఫ్ మద్దతు

పెద్దపల్లిరూరల్: నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు తెలంగాణ ప్రజాఫ్రంట్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని ఉపాధ్యక్షులు గాండ్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్, సభ్యులు అంజయ్య, రాజు, సుధాకర్ కోరారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని ఓదెల, లంబాడితండా గ్రామాల్లో పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు.

• కేసీఆర్‌ను కలిసిన కోరుకంటి చందర్

గోదావరిఖని: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లో కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై మాట్లాడారు.

• ధర్మారం ఎస్సైగా ప్రవీణ్‌కుమార్

ధర్మారం: ధర్మారం పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. ఇక్కడ పనిచేసిన శీలం లక్ష్మణ్‌ను రామగుండ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను ధర్మారం ఎస్సైగా నియమించారు.

• విద్యుత్ వైర్లు తెగిపడి గొర్రెలు మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లికి చెందిన గొర్ల కాపరి గిరవేన అజయ్ గ్రామ శివారులో నక్కల ఒర్రె సమీపంలో గొర్లు కాస్తుండగా కరెంట్ వైర్లు తెగిపడి మూడు గొర్రెలు మృతి చెందాయి. ఈ విషయాన్ని గొర్ల కాపరి విద్యుత్ అధికారులకు తెలపడంతో విద్యుత్‌ను నిలిపివేశారు. మృతి చెందిన గొర్ల విలువ రూ.40వేలు ఉంటుందని బాధితుడు అజయ్ తెలిపాడు.

• షాపింగ్ కాంప్లెక్స్ పనుల పరిశీలన

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఎదుట నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ పరిశీలించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరిన విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు తెలిపి అర్హులైన వారికి సత్వరమే కేటాయించాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు.

మహిళలందరికీ సంఘాలు ఏర్పాటు

పెద్దపల్లిరూరల్: ఇందిరా మహిళా శక్తి ద్వారా ప్రతీ మహిళ సంఘ సభ్యురాలిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం సంపత్ అన్నారు. పెద్దపల్లి ఎంపీడీవో ఆఫీసు వద్ద మంగళవారం మండల జాగృతి, జనని సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి సంబరాలు జరుపుకున్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల స్వశక్తి సంఘాల మహిళలను సమావేశ పరిచి సెర్ప్ ద్వారా అమలవుతున్న పథకాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీఎం కళ్యాణి, రమాదేవి ఉన్నారు.

ఓదెల ఐకేపీ కార్యాలయంలో సంబరాలు

ఓదెల: ఓదెల ఐకేపీ కార్యాలయంలో మహిళలు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలు పథకాల గురించి ప్రచారం చేశారు. డీసీఎం సంజీవ్, ఏపీఎం లతమంగేశ్వరీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆలేటి స్వప్న, సీసీలు మారెల్ల శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, రాజకుమారి, సీఏలు స్వప్న, అనూష, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

బానిసలుగా మార్చేందుకే నూతన లేబర్‌కోడ్‌లు



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: కార్మికులను బానిసలు మార్చడానికే కేంద్రం నూతన లేబర్‌కోడ్‌లు ప్రవేశపెట్టిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. జీడీకే–2ఏ గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 9న దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. కార్మిక సంఘాల నాయకులు విశ్వనాథ్, సదానందం, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, కారంపూరి వెంకన్న, దొంత సాయన్న, బి.శ్రీరాములు, చంద్రమోహన్, ఎల్.రాజకిషోర్, రఘుపతి, రాజేందర్, మెండె శ్రీనివాస్, వడ్డెపెల్లి శంకర్, నూనె కొమురయ్య, పర్లపెల్లి రవి, డి.లచ్చన్న, బి.రాంచందర్ పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెకు దూరంగా ఉండండి



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: కొన్ని కార్మిక సంఘాలు బుధవారం తలపెట్టిన సమ్మెకు కార్మికులు దూరంగా ఉండి విధులకు హాజరుకావాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు కోరారు. ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులతో మంగళవారం జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికంగా సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావని, సింగరేణి యాజమాన్యం తీర్చగలిగినవి కావని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ పరిధిలో సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్నందున సమ్మెకు దూరంగా ఉండాలన్నారు. సమ్మెలో పాల్గొనడంతో సంస్థకు నష్టం వాటిల్లడమే కాకుండా కార్మికులు కూడా వేతనం కోల్పోయి నష్టపోతారన్నారు. కార్మికులు సమ్మెకు దూరంగా ఉండి విధులకు హాజరుకావాలని ఆయన కోరారు. ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్, ప్రాజెక్టు అధికారులు జె.రాజశేఖర్, సీ.హెచ్.వెంకటరమణ, ప్రవీణ్ వి.ఫాంటింగ్, విభాగాధిపతులు కాశీ విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్, బి.సుదర్శనం, రాజేంద్ర కుమార్, డీపీఎం గుర్రం శ్రీహరి, సీనియర్ పీవో రవిచంద్ర పాల్గొన్నారు.

లాంగ్ స్టాండింగ్ అధికారులను బదిలీ చేయాలి

రామగిరి: సింగరేణి సంస్థలో లాంగ్ స్టాండింగ్ అధికారులను వెంటనే బదిలీ చేయాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని సెంటినరికాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న లాంగ్ స్టాండింగ్ అధికారులను ఎందుకు బదిలీ చేయడం లేదని, ఒకే ఏరియాలో ఉండడంతో అవినీతికి పాల్పడే అవకాశం ఉందన్నారు. మూడేళ్ల నిబంధనలు ఉన్నా పదేళ్లుగా ఒకే ఏరియాలో కొనసాగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సంబంధిత అధికారులను వెంటనే బదిలీ చేయని పక్షంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



విరాళాలు సేకరించిన స్థానికులతో ఎస్సై స్వామి

పాలకుర్తి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని బసంత్‌నగర్ ఎస్సై స్వామి కోరారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామారావుపల్లి గ్రామంలో మంగళవారం స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. హెడ్‌కానిస్టేబుల్ నరేందర్, పీసీలు అనిల్, సురేశ్ గ్రామస్తులకు సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించడంతో దాతలు స్పందించారు. 14 కెమెరాల ఏర్పాటుకు రూ.80వేలు సేకరించారు. ప్రతీ గ్రామంలోను స్థానికులే స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సందవేన రాజయ్య, రాజ్‌కుమార్, పానవేన హరీశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

రోడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రోడ్లన్నీ శుభ్రంగా ఉండేలా కార్మికులతో శుభ్రం చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని రాజీవ్ రహదారిపై ఇసుక మేటలు పెట్టడంతో మంగళవారం కార్మికులతో శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ రహదారి వెంబడి ఇసుక ఉండడంతో బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నిత్యం శుభ్రం చేయాలని కార్మికులను ఆదేశించారు.